# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 13 ఫిబ్రవరి, 2026 | పేజీలు :08


## నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్



**ప్రజాపక్షం/అంతర్గాం:** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లిలోని మిషన్ భగీరథ పంపుహౌస్ వద్ద, కుందనపల్లి ఐవోసీఎల్ ఏరియాలోని ఇంధన నిల్వల కేంద్రాల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. కార్మికులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ, నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, నాయకులు ఆడారి నర్సింగరావు, పసుల భీమయ్య, తమ్మనవేణి శంకర్, కండ్లె శ్రీనివాస్, కండ్ల శంకర్, దుర్గం శంకర్, కండ్ల మొండయ్య, పెగడపల్లి అంజయ్య, శ్యామ్, సంపత్, రవీందర్, సతీష్‌లు పాల్గొన్నారు.

# సింగరేణిలో కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం/రామగిరి :** 12వ తేదీన ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మె లో భాగంగా అర్జీ 3 ఏరియ లో అన్ని కార్మిక సంఘాలు కలిసి జేఏసి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏఎల్పీ ఓసిపి1 ,ఓసిపి2 , జిఎం ఆఫీస్ మైన్ ల దగ్గర ధర్నా, ర్యాలీ చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి. రావు ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు కోట.రవీందర్ రెడ్డి , టీబీజీకేస్ నాగెల్లి. సాంబయ్య సిఐటియు కొమురయ్య ఈ సమ్మెలో పాల్గొని మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షేక వ్యతిరేక విధానాలకు మరియు నాలుగులేబర్ కోడ్ ల రద్దు చేయాలికాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలిసింగరేణికి చెల్లించాల్సిన అప్పు సుమారు 47 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలిబొగ్గు తీసే పనుల్లో పర్మనెంట్ కార్మికుల నే నియమించాలినూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలిఇలా మరెన్నో కార్మికుల హక్కులు కాల రాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ సమ్మె అని ప్రకటించారు ఈ కార్యక్రమంలోజూపక. రామ్ చందర్ ఐఎన్టియుసి బ్రాంచ్ సెక్రెటరీ బెల్లం. శ్రీనివాస్ ,బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రెటరీ ఎం ఆర్ సి రెడ్డి, , అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డిటి రావు , ఎల్ పి పిట్ సెక్రెటరీగంగాధర్ , సిహెచ్పి పిట్ సెక్రెటరీ గంధం. శ్రీనివాస్ , ఓసిపి2 ఫిట్ సెక్రెటరీ సురేష్ జీ యం చర్చల కమిటీ ప్రతినిధులు, తదితర యూనియన్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నిర్మల్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు
## సర్వం సిద్ధం :ఎస్‌పి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేంద్రం లోపలికి కేవలం ఎన్నికల కమిషన్ జారీ చేసిన అనుమతి పత్రాలు కలిగిన సిబ్బందిని, అభ్యర్థులను వారి ఏజెంట్లను మాత్రమే తనిఖీ చేసిన తర్వాత అనుమతిస్తామని ఆమె స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కౌంటింగ్ కేంద్రం వైపు వచ్చే దారుల్లో బారికేడింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, వాహనాల నిలుపుదల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా భద్రతా విధుల్లో ఉన్న సిబ్బందికి, అధికారులకు విధివిధానాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. బందోబస్తులో భాగంగా అదనపు బలగాలను, గస్తీ బృందాలను నిరంతరం పర్యవేక్షించేలా మోహరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్,పలువురు ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్తూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, రైతు కూలి సంఘం, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు వెలుతురు సదానందం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులు కనీస వేతనాలు, సమ్మె చేసుకొనే హక్కు, పని గంటల పెంపు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 కోడ్ లను రద్దు కోసం పోరాడాలని అన్నారు. ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వీబి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలనీ బడ్జెట్ కేటాయింపులు పూర్తి స్థాయిలో కేంద్రమే భరించాలని, రాష్ట్రాల వాటా పెంపు అంటే చట్టాన్ని ఎత్తివేసే కుట్ర అని అన్నారు. విద్యుత్ సంస్కరణ ల పేరుతొ పేదల నడ్డి విరిచే తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టం ను రద్దు చేయాలనీ అన్నారు. అమెరికా తో కుదుర్చుకున్న వ్యవసాయ,వాణిజ్య ఒప్పందాల వాళ్ళ భారత వ్యవసాయ, రైతాంగ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలనీ, ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, విద్యుత్ సవరణ చట్టంను భారత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే అమెరికా తో చేసుకున్న వ్యవసాయ, వాణిజ్య ఒప్పందాల నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు.మధ్యభారతం లో జరుగుతున్న ఆదివాసీల హననం ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో ఏఐఎఫ్టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, జిల్లా నాయకులు కోరేపు రాజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు ప్రజలు సహకరించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని, లెక్కింపు కేంద్రాల వద్ద రద్దీని నివారించేందుకు మరియు సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు నగరంలో ట్రాఫిక్ దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. ఈ ఆంక్షలు ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అమలులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే అన్ని రకాల వాహనాలను రేకుర్తి చౌరస్తా వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు శాతవాహన యూనివర్సిటీ, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్ మీదుగా చింతకుంట ద్వారా నగరంలోకి చేరుకోవాల్సి ఉంటుంది.



కరీంనగర్ నుండి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు నగరం నుండి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు తెలంగాణ చౌక్, రామ్ నగర్, పద్మనగర్, చింతకుంట మీదుగా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్, అక్కడి నుండి శాతవాహన యూనివర్సిటీ, రేకుర్తి చౌరస్తా మీదుగా జగిత్యాల వైపు వెళ్లాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ కోరారు. ఎమర్జెన్సీ వాహనాలు మినహా మిగిలిన అన్ని వాహనాలు పైన పేర్కొన్న ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు.

## సమ్మెకు జెఎసి నాయకుల సంఘీభావం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించిన సమ్మెకు ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్మిక నాయకులు కౌశిక హరి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, కార్మికులు లేబర్ గేట్ ఎదురుగా నిరసన ప్రదర్శన, ర్యాలీ చేపట్టారు. కార్మికుల హక్కులకై తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకై కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఇదేవిధంగా రానున్న రోజుల్లో కార్మికులు పోరాట ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## టాస్క్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుంది

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** టాస్క్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని గాయత్రి కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ అన్నారు.గురువారం రోజున పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టాస్క్ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ తరగతులు ప్రారంభం కాగా కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, పెద్దపల్లి టాస్క్ రీజనల్ ఇన్చార్జ్ డాక్టర్ కౌసల్య, టాస్క్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ భవాని పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ విద్యతో పాటు విద్యార్థులలో వివిధ రకాల నైపుణ్యాలు పెంపొందించడానికి టాస్క్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సాఫ్ట్వేర్ జాబ్స్ ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులకే వస్తాయి అనేది ఒక అపోహ డిగ్రీ చదివిన విద్యార్థులు రూరల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన విద్యార్థులు మా కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు వివిధ రకాలైన ఎం ఎన్ సి కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని డిగ్రీ విద్యతో పాటు అనేక కాంపిటీటివ్ ఉద్యోగాలు సాధించడానికి టాస్క్ చాలా ఉపయోగపడుతుంది తెలియజేశారు. పెద్దపల్లి టాస్క్ రీజనల్ ఇంచార్జ్ డాక్టర్ పి కౌసల్య విద్యార్థులు టాస్క్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చిన్న కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎంతో మంది ఉద్యోగాలు సాధించారని, టాస్క్ లో కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్,ఇంటర్వ్యూ స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పించడం జరుగుతుందని సూచించారు. ఈ రోజులో భాగంగా సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ భవాని గారు విద్యార్థులకు అయామ్ యూనిక్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫర్ కెరీర్, ఆర్ట్ ఆఫ్ స్పీకింగ్ అనే మూడు అంశాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే .రవీందర్, టాస్క్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కే కుమార్ మరియు ఎం ఏ సమద్ ,శారద మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామగుండం బల్దియాలో ఓట్ల లెక్కింపు నేడు!

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం బల్దియా ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ మేరకు రామగుండం నగరపాలక సంస్థ అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రమైన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం సంస్థ కార్యాలయంలో రామగుండం ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ ఆధ్వర్యంలో అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది, ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ, సిబ్బంది ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్టు చేయాలన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తర్వాత అన్ని డివిజన్లకు సంబంధించి ఏకకాలంలో బ్యాలెట్ బాక్సులలో పోలైన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. వెయ్యి ఓట్లకు ఒక రౌండ్ చొప్పున దాదాపు మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుందన్నారు. కౌంటింగ్ సూపర్ వైజర్గా, కౌంటింగ్ అసిస్టెంట్లుగా 180 మందిని ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు కె.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, నగరపాలక సంస్థ ఎసిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్, డిఈ శాంతి స్వరూప్‌లు పాల్గొన్నారు.




## వీణవంక మండలంలో సార్వత్రిక సమ్మె విజయవంతం

**ప్రజాపక్షం/వీణవంక:** దేశవ్యాప్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని వీణవంక మండల కేంద్రంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు పిల్లి రవి యాదవ్ ఆధ్వర్యంలో విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి వీణవంక బస్టాండ్ వరకు ర్యాలీ అనంతరం సభ నిర్వహించడం నిర్వహించి మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాలలో ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి అన్యాయం చేసిందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యాధావిధిగా కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని కోరారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చొప్పరి శ్రీనివాస్, హమాలీ మండల కార్యదర్శి తడిగొప్పుల రాజయ్య, జిపి మహంకాళి కొమురయ్య, దాసారపు శంకర్, కండె సదయ్య, మంత్రి రవి, ఆర్. రమేష్, రమేష్, చొప్పరి ఐలయ్య తదితరులున్నారు.




## ఇల్లందకుంటలో నిరసన ర్యాలీ

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** లేబర్ కోడ్స్ కార్మికుల మెడకు ఉరితాలు వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ ప్రధాన ఉద్దేశం దేశంలో కార్మికోద్యమాన్ని దెబ్బతీయడం ద్వారా పెట్టుబడికి దాని దోపిడీకి ఆటంకాలు లేకుండా చేయడం అని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గంపై పనిగంటల భారాన్ని పెంచుతూ కార్మిక జన సమూహాన్ని కట్టు బానిసలుగా పెట్టుబడుదారికి అనుకూలంగా మార్చుకోవాలని చూడటం అన్నారు. యూనియన్ల ఏర్పాట్లపై ఆంక్షలు: 1926 ట్రేడ్ యూనియన్ యాక్టివ్ ఈ లేబర్ కోడ్ మింగేసింది. ఈ కోడ్ లోని సెక్షన్ 6 (2) 6(4) ప్రకారం యూనియన్ల రిజిస్ట్రేషన్ కష్టతరమై కాదు దాదాపు అసంభవం చేస్తున్నాయి. ఇట్లాంటి చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని వెంటనే ఈ చట్టాలను ఉపసంహరించుకునే అంతవరకు పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. పాల్గొన్న వారిలో సిఐటియు మండల అధ్యక్షులు రేణిగుంట్ల సారయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ జముకుం వెంకన్న, కో కన్వీనర్ రావుల ఎల్లయ్య, గ్రామపంచాయతీ యూనియన్ గాదిసిరి సంపత్, తోడం శ్రీనివాస్, సారయ్య, చంద్రయ్య, సత్తి, మధుకర్, రమేష్, సమ్మయ్య, రాజయ్య, వీరస్వామి, సాంబయ్య, శ్రీనివాస్, ఆనందం, కుమార్, శ్యామ్, తిరుపతి, తోపాటు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి యస్‌జిఎఫ్ క్రికెట్ పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఈ నెల 13 నుంచ 26వ తేదీ వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని జడ్చర్ల మినీ స్టేడియంలో జరగనున్న 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17 బాలుర క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని కె.విశ్వతేజ పి.కేదార్‌నాథ్ (9వ తరగతి) లు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు తెలిపారు. ఇటీవల సిరిసిల్ల జిల్లాలో జరిగిన అండర్ 17 బాలుర ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వియయం ప్రసాద్, కె.హన్మంతరావులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయుడు యస్.రాజు, జి.మహేష్‌లు పాల్గొన్నారు.

## ఎల్లంపల్లిలో చెట్ల పొదల తొలగింపు

**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామ పంచాయతీలోని రహదారులకు ఇరువైపుల దట్టంగా పెరిగిన చెట్ల పొదలను గ్రామ సర్పంచి ఆరుముల్ల మాధవి మల్లేష్ ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. ప్రత్యేకంగా జె.సి.బి. వాహనంతో చెట్ల పొదలను పూర్తిగా తొలగించారు. గ్రామ ప్రజలు, వాహనాల రాకపోకలకు అనుకూలంగా రహదారులకు ఇరువైపుల నేల చదును చేశారు. చెట్ల పొదల కారణంగా రహదారులు సరిగా కనిపించకుండా ప్రజలు, వాహనదారులు ఇన్నేళ్లుగా ఇబ్బంది పడ్డారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణ పనులను గ్రామ సర్పంచి గాదె స్రవంతి సుధాకర్ గురువారం ప్రారంభించారు. గ్రామ వార్డు సభ్యురాలు ఉప్పులేటి మమత, పవన్ దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు సర్పంచి పూజలు చేసి ప్రారంభించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సహకారంతో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా, నాణ్యవంతంగా జరుగుతున్నాయని సర్పంచి స్రవంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రమేష్, మాజీ సర్పంచి గంగాధరి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు మర్రి రాజ్‌కుమార్, ఉప్పులేటి శేఖర్, ఉప్పులేటి మల్లమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ ఆర్ కళాశాల ఆవరణలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 450 మందిదో బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బ్యాక్సులను అధికారులు జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి పటిష్ట బందోబస్తుతో తరలించారు. శుక్రవారం ఉదయం కౌంటింగ్ ప్రారంభం కానుండగా ఫలితాల కోసం జిల్లా ప్రజలు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. జగిత్యాల మున్సిపల్‌లో 50 వార్డులు ఉండగా 254 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 149 పోలింగ్ కేంద్రాల్లో 65,985 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెట్‌పెల్లి మున్సిపల్‌లో 26 వార్డుల్లో 150 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 75 పోలింగ్ కేంద్రాల్లో 31,975 మంది, కోరుట్ల మున్సిపల్‌లో 33 వార్డులు ఉండగా 150 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 102 పోలింగ్ కేంద్రాల్లో 44,115 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాయికల్ మున్సిపల్‌లో 12 వార్డులు ఉండగా 49మంది అభ్యర్థులు బరిలో ఉండగా 24 పోలింగ్ కేంద్రాల్లో 9,808మంది, ధర్మపురిమున్సిపల్‌లో 15 వార్డులు ఉండగా 52 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 29 పోలింగ్ కేంద్రాల్లో 10.562 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లాలో 70.13 పోలింగ్ శాతం నమోదు కాగా ఫలితాలపై అభ్యర్థులు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

# ఓట్ల లెక్కింపుకు పటిష్ట బందోబస్తు

### నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సిరిసిల్ల, వేములవాడలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు నిర్వహించడం, డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టపాకాయలు కాల్చడం, భారీగా గుంపులు, గుంపులుగా గుమికూడటం, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఎటిసిలో 3డి ప్రింటింగ్ కోర్సు ప్రవేశాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల ఏటిసిలో 3 డీ ప్రింటింగ్ కోర్సు ప్రవేశాలకు ఆహ్వానం కోరుతూ జగిత్యాల పట్టణంలోని కరీంనగర్ రోడ్ నర్సింగపూర్ లో ఇటీవలే నూతనంగా ఏర్పాటైన (ఏటిసి) అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో పిఎంకెవివై 4.0 స్కిమ్ లో భాగంగా సోమవారం నుండి 3 డీ ప్రింటింగ్ కోర్సు ప్రారంభం అవుతుందని జగిత్యాల గవర్నమెంట్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు కాల వ్యవధి 3 మూడు నెలల ఉంటుందని ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వబడినని ఈ నెల 17 వ తేదీ నుండి ప్రారంభం అవుతుందని ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి మంచి భవిషత్తు ఉంటుంది అని కావున నిరుద్యోగ యువత అందరూ ఈ యొక్క మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కోరారు. ఈ కోర్సు చేయాలనుకునే వారు ఎస్.ఎస్.సి మెమో జిరాక్స్, ఆధార్, కుల ధృవీకరణ పత్రం, ఈ మెయిల్ ఐడి, మొబైల్ నెంబర్ అవసరం ఉంటుందని వివరాల కోసం8328509488,9542866148,9440861486 ఈ నంబర్స్ సంప్రదించాగలరని ప్రభుత్వఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రతి ఖాతాదారుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా కేవైసీ ని అప్డేట్ చేసుకొని డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నా ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మల్లాపూర్ కెడిసిసిబి బ్యాంక్ మేనేజర్ భూక్య ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు గురువారం గుండంపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు ఆర్ బి ఐ రూపొందించిన అవగాహన ప్రచార పోస్టర్ను గ్రామ సర్పంచ్ డప్పుల పద్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్పలత నర్సయ్య, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు మల్లాపూర్ సొసైటీ సీఈవో పాదం భూమేష్,ఉన్నారు.

## అనుమతిలేని మధ్యం అమ్మకాలపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని రాజన్నపేట గ్రామంలో బెల్ట్‌షాప్‌లు వెలిశాయని అనుమతులు లేకుండా అమ్మకాలు జరుపుతున్నారని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ అధికారికి గ్రామస్థుల సంతకాలతో కూడిన పిర్యాదును పిరమిడ్ పార్టీ సభ్యులు ద్యాపదేవయ్య అందచేశారు.విచ్చలవిడిగా మధ్యంఅమ్మకాలతో యువతపెడతోవన పడుతుందని కాయకష్టం చేసిన డబ్బులు వృధా కష్టం చేసుకుంటున్నారని ఆవేదన చెందారు.తగుచర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను కోరారు.

## అటవీశాఖ నోడల్ ఆఫీసర్ పర్యటన



**ప్రజాపక్షం/రామగిరిః** రామగుండం3 ఏరియాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్, నోడల్ ఆఫీసర్ సి.శరవణన్ (ఐ.ఎఫ్.ఎస్) పర్యటించారు.వారికి ముందుగా రామగిరి అతిథి గృహమునందు ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టి.లక్ష్మి పతి గౌడ్, రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాక్రిష్ణ లు పుష్ప గుచ్చన్ని అందజేసి స్వాగతం పలికారు.అనంతరం సంబధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మందమర్రి ఏరియా లోని రామకృష్ణాపూర్ ఉపరితల గనికోసం రామగుండం3 ఏరియా ఓసిపి1 ఉపరితల గని పరిధిలోని ఓ.బి.డంపుపై కేటాయించిన 102 హెక్టార్ల (సి.ఎ.ల్యాండ్) భూమిని ప్రభుత్వ అటవీ శాఖకు అప్పగించడానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టి.లక్ష్మి పతి గౌడ్, రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ వారికి వివరాలు తెలియజేశారు.వారితో పాటు అటవీశాఖ హైదరాబాద్ నుండి విచ్చేసిన డిప్యూటీ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ డి.సంహిత, సైంటిఫిక్ ఆఫీసర్ నవీన్, సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ ఫర్గెన్, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (కాలేశ్వరం సర్కిల్) డాక్టర్ బి.ప్రభాకర్ (ఐఎఫ్ఎస్), డీ.ఎఫ్.ఓ.శివయ్య, ఎఫ్ఆర్ఓలు వినయ్ నాయక్, రమేష్, తోపాటు ఇతర సింగరేణి, ఫారెస్ట్రీ అధికారులు ఉన్నారు.

## కార్మికుల హక్కుల కోసం నిరసన జ్వాల...



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలో కార్మికులు భారీ ఎత్తున నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఉప సర్పంచ్ నరేష్, న్యాత మోహన్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ కుమార్ పాల్గొని తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ కార్మికుల రక్తాన్ని పీల్చేలా ఉన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఎండగట్టారు. 4 లేబర్ కోడ్‌లను, నూతన జాతీయ విత్తన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని, ఇన్సురెన్స్ రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, కనీస వేతంన రూ.26000 గా నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటికరించడం అపాలని, ఆశా, అంగన్‌వాడీ వంటి స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, మోటార్ వెహికల్ యాక్ట్ 2019ని సవరించాలని, విబిజి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పొత్తూరి చిన్న రాజం, హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు అన్నారం రాజేశం, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు న్యాత నరసయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షులు నరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు మనోజ్ కుమార్ తమ సంఘాల తరపున పాల్గొని అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, ప్రభుత్వాలు దిగి రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పుర పోరులో విజయం ఎవరిది.?




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఉత్కంఠ భరితంగా సాగిన సుల్తానాబాద్ పురపాలక పోరు చివరి దశకు చేరింది. బుధవారం సుల్తానాబాద్ పురపాలక సంఘం ఎన్నికలు ముగియడంతో విజయ బావుటా ఎగరవేసేది ఎవరో నిరాశతో వెనుదిరిగేది ఎవరో అని సుల్తానాబాద్ ప్రజలు ఎదురుచూస్తున్నారు. నేడు జరిగే ఓట్ల లెక్కింపు పైనే అభ్యర్థులతో పాటు ఓటర్లుసైతం దృష్టి సారించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 16824 మంది ఓటర్లు ఉండగా 13716 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 6692 స్రీలు 7023 ఇతరులు ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు ఓటు హక్కు వినియోగం పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిన 81. 52 శాతం నమోదవడం విశేషం. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను వివిధ పార్టీలకు చెందిన మొత్తం 61 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో అధికార కాంగ్రెస్ పార్టీ పక్క ప్రణాళికతో గెలుపు గుర్రాలను బరిలో నిలపగా వీరికి దీటుగా భారతీయ జనతా పార్టీ పూర్తి వార్డులలో గట్టి పోటీనిచ్చే అభ్యర్థులను బరిలో నిలిపింది. గత పది సంవత్సరాలు పాలన కొనసాగించిన భారత రాష్ట్ర సమితి అభ్యర్థుల ఎంపికలో విఫలమైనట్టు స్పష్టంగా కనిపిస్తుంది. అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ పలు వార్డులలో అభ్యర్థులు సైతం ఇష్టానుసారంగా డబ్బు మద్యం పంపిణీ చేశారు.రాత్రికి రాత్రి లక్ష్మీ దేవి ఓటర్ల తలుపు తట్టింది. ఓటుకు వెయ్యి నుండి మొదలుకొని ఐదు వేల వరకు అభ్యర్థులు పంపిణీ చేశారు.

## రైల్వేస్టేషన్ ఎదుట కార్మికుల ధర్నా




**ప్రజాపక్షం/రామగుండం :** నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట సిఐటియు అనుబంధ తెలంగాణ రైల్వే కాంట్రాక్టు, క్యాజువల్ అండ్ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.రామాచారి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల శ్రమశక్తిని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులు దోచుకునే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.యాసిన్, బొంకూరి మహేష్, కె.తిరుపతి, సరళ, కె.జ్యోతి, ప్రదీప్, వినోద్, శివ, రేణుక, రఫీక్, కట్ట స్వామి, సతీష్, మురళి, అయిత రమేష్‌లు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధులతో పంప్‌సెట్..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** గ్రామపంచాయితీ నిధులతో ఏర్పాటు చేసిన పంప్‌సెట్ మోటర్ బిగించి గొల్లపల్లి సర్పంచ్ కొండరమేష్ గౌడ్ ప్రారంభించారు. శుక్రవారం సింగిల్‌ఫేజ్ పంప్‌లైన్ గ్రామస్థుల సౌకర్యార్థం వేసవికాలంలో నీటిఎద్దడి లేకుండా చూస్తామన్నారు. పీర్ల మసీద్ ప్రాంతంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేశామని మీడియాతో తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సతీష్, మల్లేష్, రాంచంద్రం, హరీష్, పర్శగౌడ్, అరుణజ్యోతి, వెంకటేష్ రెడ్డి, మురళీ, నాగరాజు, అశోక్, నర్సయ్య, రాజు, కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

## రాయపట్నం గోదావరి వద్ద భక్తులకు సౌకర్యాలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గోదావరి నదీ తీరంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు నూతనంగా గదులను ఏర్పాటు చేశారు.గోదావరి నదీ స్నానాలకోసం వచ్చే మహిళా భక్తులు పుణ్యస్నానాలనంతరం తడి దుస్తులు మార్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం గ్రామ సర్పంచ్ రాందేని మొగిలి దృష్టికి రాగా పాలకవర్గంతో చర్చించి రూ.45 వేలతో నూతనంగా గదులను ఏర్పాటు చేశారు.ఏర్పాట్ల పట్ల మహిళలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## నూతన సర్పంచ్‌ను సన్మానించిన మహిళా సంఘ సభ్యురాలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామ సర్పంచ్ పుప్పాల లక్ష్మి మహేష్ ను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యురాలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐకెపి సీసీ సయేందర్, మహిళా సంఘ సభ్యురాలు కలిసి సర్పంచ్ ను ఉపసర్పంచ్ రాపెల్లి మహేష్, పంచాయతీ కార్యదర్శి రవళిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఓ లు కంతం మేరీ, రాడే గౌతమి, మహిళా సంఘ సభ్యురాలు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు తేలనున్న భవితవ్యం

**ప్రజాపక్షం/రాయికల్ :** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలో బుధవారం జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. రాయికల్ మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమదే గెలుపు అంటూ ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. నేటికి ఎన్నికల ఫలితాలతో అభ్యర్థుల భవితాలు తెల్లనున్నాయి. గెలిచిన అభ్యర్థులు మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని అలాగే ఓడిన అభ్యర్థులు ప్రతిపక్షంగా ఉంటూ సమస్యలపై పోరాటం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం /మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల , జడ్పీహెచ్ఎస్ ,ఎంపీ పీఎస్ పాఠశాలలను గురువారం జగిత్యాల విద్యాధికారి కే.రాము ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులతో సమావేశమయ్యి రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో పలు సూచనలు చేశారు. ఈనెల 17 న ప్రారంభమయ్యే ఎస్ ఎస్ సి ప్రీ ఫైనల్ పరీక్షలను అన్వేల్ ఎగ్జామ్ గా భావించి పరీక్షలు రాయాలని విద్యార్థులను కోరారు. అలాగే సీ గ్రేడ్ విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శించి ఎఫ్ ఎల్ ఎస్ పైన మూడవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈనెల 26వ జరిగే ఎఫ్ ఎల్ ఎస్ పరీక్షకు పిల్లలను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడీసీ చంద్రశేఖర్ రెడ్డి మండల విద్యాధికారి జయసింహారావు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మానస, శైలజ,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాల సమావేశానికి భవనాలు ఎంతో ఉపయోగం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గ్రామాలలో మహిళా సంఘాల సమావేశానికి, శిక్షణ కార్యక్రమాలకు ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించే భవనాలు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం రాఘవపేట గ్రామంలో 30 లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో నిర్మించే మూడు మహిళ సంఘాల భవనాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా స్వామివారి దర్శించుకున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల నరసయ్య, ఎంపీడీవో శ్రీకాంత్ పిఆర్ ఏఈ రాగసుధ, ఏపిఎం విమోచన, నాయకులు డీలర్ మల్లయ్య, గౌరు నగేష్, బైరి రవికుమార్ ,రాకేష్ ,తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సాక్షరతపై ఆర్‌బిఐ జిఎం అవగాహన

**ప్రజాపక్షం/రాయికల్ :** దేశవ్యాప్తంగా ఈనెల 09 నుండి 13 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరుణంలో గురువారం రాయికల్ మండలం లోని జగన్నాథ్ పూర్ గ్రామంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులందరికీ గ్రామస్తులు గుస్సాడి వేషధారణ, డప్పు చప్పుల్లతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన చిత్రాలతో కూడిన టీ షర్టులు, టోపీలు ధరించి వాకథాన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్బీఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్ మాట్లాడుతూ ఈ సంవత్సరపు ప్రధాన అంశం "కేవైసీసురక్షిత బ్యాంకింగ్‌కు తొలి అడుగు" అనే విషయంపై కేంద్రీకృతమై ఉందని అన్నారు .ప్రజలలో సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను నవీకరించుకోవడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం, సైబర్ భద్రతపై జాగ్రత్తలు పాటించడం మరియు ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు. ప్రతి ఖాతాదారుడు తన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను వెంటనే నవీకరించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్, టిజీబి ఆర్ ఎం రాజ నరేంద్ర, ఎమ్మార్వో నాగార్జున, ఎంపివో సుష్మా, ఏఎస్సై యూబీఐ, ఎస్బీఐ శాఖల మేనేజర్లు శంకర్, నరేష్, పవన్ కుమార్, మాధురి, ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, నాగేంద్ర ప్రసాద్, నవీన్, రాజేష్, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తును మోహరించినట్లు ఆయన పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడు స్థాయిల్లో భద్రతను ఏర్పాటు చేశాం. కేంద్రానికి 100 మీటర్ల దూరం నుండే భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి, అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషిద్ధం చేశామని సీపీ తెలిపారు. మొదటి గేట్ నుండి కేవలం పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు మరియు విధుల్లో ఉన్న సిబ్బందికి మాత్రమే అనుమతి ఉంటుందని,రెండవ గేట్ నుండి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు మరియు మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడమైనది. వీరందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వైపు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తుగా దారి మళ్లింపు చర్యలు చేపట్టాం. జగిత్యాకరీంనగర్ మార్గంలో ప్రయాణించే వారు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల కోసం నిర్ణీత దూరంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాల ను కేటాయించడమైనది. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నా రు. కౌంటింగ్ కేంద్రం బయట ఎటువంటి గుం పులు ఏర్పడకుండా పుషింగ్ పార్టీలను రంగంలోకి దించామని, నగరవ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ నిర్వహి స్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నామని సీపీ తెలిపారు.

## ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటిలు, మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షట్‌పేట మున్సిపాలిటిల్లో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు రామగుండం సి.పి. అంబర్ కిషోర్ ఝూ అన్నారు. గురువారం సి.పి. గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి బందొబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయటి ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందొబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో, వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 1,075 మంది పోలీస్, భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన బందొబస్తు ఏర్పాట్లు చేసినట్లు సి.పి. తెలిపారు.



## ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు. గురువారం రోజున కౌంటింగ్ ఏర్పాట్లను సహాయ ఎన్నికల అధికారి & మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం రోజున స్థానిక మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని మొదటగా 215 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందని తదనంతరం బ్యాలెట్ బాక్స్ ఓట్ల లెక్కింపు ఉంటుందని 36 వార్డులకు గాను మొత్తం ఆరు కౌంటింగ్ సెంటర్లు,ఆరుతో లెక్కింపు ఉంటుందని, మొత్తం 120 మంది సిబ్బంది పాల్గొంటున్నారని పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా ఎలక్షన్ ఏజెంట్ మరియు కౌంటింగ్ ఏజెంట్ సంబందించిన రిటర్నింగ్ ఆఫీసర్ ద్వార పొందిన గుర్తింపు కార్డు వెంట ఉండాలని లేని యెడల అనుమతి లేదని కౌంటింగ్ కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు,ఆహారం,నీరు అనుమతి లేదని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు మాకు సహకరిస్తున్నటువంటి జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష , జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ ,పోలీస్, రెవెన్యూ,ఎలక్ట్రిసిటీ,మెడికల్, ఫైర్ మరియు ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా మిత్రులకు, అలాగే మా రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులు,టి.ఓ టి మాస్టర్ ట్రైనర్ కృష్ణా రెడ్డి మున్సిపల్ సిబ్బందికి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, కృష్ణ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## 18న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు టాటా మోటార్స్ & హుండాయ్ కంపెనీల్లో 40 సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఈ ఉద్యోగాల కొరకు విద్యార్హతలు ఐటిఐ, డిప్లమా, ఎలక్ట్రికల్, మెకానికల్, ఏదైనా డిగ్రీ అర్హత, వయస్సు 19 సంవత్సరాల నుండి 25 సంవత్సరాలు ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తిగలవారు ఫిబ్రవరి 18న బుధవారం రోజు ఉదయం 11 గంటల నుంచి సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థు రూమ్ నెంబర్. 233 వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీచెన్నకేశవస్వామి కల్యాణ ఉత్సవాలు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం సుదర్శన నృసింహా హోమం, తీర్థప్రసాదం, రథబలి, రథోత్సవం, పుష్పయాగం, చక్రస్నానం, గ్రామబలి కార్యక్రమాలు చేపట్టనున్నారు. గ్రామ ప్రజలతోపాటు సమీప గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటి సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెద్దపల్లి తిరుమల, ఆలయ కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కనబడుటలేదు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామానికి చెందిన కోడెం రాజేష్ వయసు 32 సంవత్సరాలు కనబడుట లేదు అని అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.కొడం రాజేష్ బోలోరో డ్రైవర్ గా పనిచేయుచున్నాడు. ఈనెల ఐదవ తారీఖున ఉదయం 8:30 గంటలకు ఇంటిలో నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు అని అతని తల్లి కోడం లత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయటం జరిగింది.ఇతని వివరములు ఎవరికైనా తెలిసినచో సుల్తానాబాద్ ఎస్సై 8712656511, సుల్తానాబాద్ సిఐ 8712656510 నెంబర్లకు సమాచారం అందించాలని సుల్తానాబాద్ పోలీసులు తెలిపారు.

## అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని కంచర్ల గ్రామానికి చెందిన సివిల్ కానిస్టేబుల్ కొమ్ము దిలీప్ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దిలీప్ చిన్న తనం నుండే కష్టపడి చదివి ఇంటర్ పూర్తికాగానే 2011లో పోలీస్ జాబ్ సంపాదించాడని, కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్ స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధుల నిర్వర్తిస్తుండగా, గత నెల రోజుల నుండి ఆరోగ్యం సహకరించక ఇంటి వద్దనే ఉంటున్నాడని, మూడు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ హాస్పిటల్‌కి తరిలించగా చికిత్స అందిస్తున్న సమయంలోనే మృతిచెందాడని తెలిపారు. మృతిని భార్య సుమ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ఇద్దరు కుమారులు ప్రసన్న కుమార్, ప్రణయ్ కుమార్‌లు ఉన్నారు.

## బాలికల సంరక్షణ కోసమే బేటీ బచావో బేటీ పడావో

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** బాలికల రక్షణ కోసం, వారి చదువుల కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా వేంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ కనుముల వెంకటేష్, పోస్ట్ మెన్ సుమతి, గ్రామస్తులు తదితరున్నారు.

## జాతర గోడ పత్రికల ఆవిష్కరణ



**ప్రజాపక్షం / కౌటాల :** మండలంలోని తాటిపల్లి గ్రామ సరిహద్దు నది తీరాన వెలసిన శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయంలో మహాశివ రాత్రి జాతర గోడ ప్రతులను గురువారం కౌటాల సిఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ ఈ పత్రికలను విడుదల చేశారు. శుక్రవారం నుండి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించే జాతరను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో సౌకర్యాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ రద్దు చేయాలి

### దేశవ్యాప్త సమ్మెలో మంచిర్యాల బీమా ఉద్యోగులు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ఎల్ఐసి సంస్థలో వాటాల ఉపసంహరణతో దేశ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి కాబట్టి సదరు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మంచిర్యాల బీమా ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆఫీసు ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. లాభాలనార్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజా వ్యతిరేకమని కొత్త లేబర్ కోడుల ద్వారా కార్మిక హక్కులను హరించి కార్పోరేటర్లకు అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నదని వారు ఆరోపించారు. స్వదేశీ మంత్రం జపించిన నేతలు నేడు విదేశీ కంపెనీలకు గులాంగిరి చేయడాన్ని ప్రజలు హర్షించదని వారు విమర్శించారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి ప్రజలే స్వయంగా నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం దేశభక్తియుత పోరాటమని వారు పేర్కొన్నారు. ఐసిఈయు కరీంనగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి ఆర్.రాజేశం, మంచిర్యాల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.తిరుపతిరెడ్డి, ఎం.రామదాసు, సీనియర్ నాయకులు రమేష్‌బాబు, శైలజ, శ్రీనివాస్ , చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కోసినిలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** గ్రామ ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా స్వచ్ఛమైన నీరు తాగాలని మాలి సంఘం జనరల్ సెక్రటరీ వసాకే హన్మంతు సూచించారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలో వడై నాగేష్ ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకే శుద్ధి చేసిన నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన సిఐ

**ప్రజాపక్షం / కౌటాల :** మండలంలోని తాటిపల్లి గ్రామ సరిహద్దు నది తీరాన వెలసిన శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయం, కుల్తాలో నేటి నుండి 16వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను కౌటాల సిఐ బి. సంతోష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ వ్యవస్థను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణంలో శుభ్రత, త్రాగునీరు, విద్యుత్ దీపాల వంటి మౌలిక సదుపాయాలను సక్రమంగా కల్పించాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛంద సేవకులను నియమించాలని, వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు



తీసుకోవాలని, సిసి కెమెరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది విజయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి తనిఖీలో బయటపడ్డ అక్రమాలు

**ప్రజాపక్షం / రెబ్బన :** రెబ్బన మండలంలోని కొమరవెల్లి గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలో పలు అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని 10 పనులకు గాను కూలీల వేతనాలు 23,28,672 రూపాయలు, సామాగ్రి కోసం 27,634 రూపాయలు వెచ్చించగా, మొత్తం వ్యయం 13,56,306 రూపాయలుగా అధికారులు లెక్కలు చూపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కూలీలు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం కింద 200కు పైగా పనులు అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామ పంచాయతీలో పనుల పట్టికను ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. దీనివల్ల రైతులకు ఏ పనులు లభ్యమవుతాయో అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. గతంలో జరిగిన పనుల్లోనూ అక్రమాలు జరిగాయని,



వారంలో ఆరు రోజులు కష్టపడితే కేవలం ఐదు రోజుల వేతనమే జమ అయిందని కూలీలు అధికారులను నిలదీశారు. వేతనాల చెల్లింపులో జాప్యం, పని దినాల తగ్గింపుపై సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. రైతులకు, కూలీలకు న్యాయం జరిగేలా పారదర్శకత పాటించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఈ ఉప సర్పంచ్ దుర్గం శివరాం, వార్డు సభ్యులు కాటేపల్లి సాయికుమార్, కొయ్యల సుమత, గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష, బిఆర్‌పిలు రాజ్ కుమార్, శ్యామల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడే మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు...

### అభ్యర్థుల గుండెల్లో మొదలైన గుబులు...

### గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ...

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపాలిటీ నుండి మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన తర్వాత జరిగిన ఈ నెల 11న 60 వార్డులలో ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగా ఇక పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించే సమయం ఆసన్నమైంది. నేడు శుక్రవారం రోజున మంచిర్యాల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం8 గంటల నుండి పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు అంతా సిద్దం చేయగా గెలుపోటములపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎక్కడ చూసిన ఓట్ల లెక్కింపు వల్ల వచ్చే గెలుపు, ఓటముల ఫలితాలపై తర్జన భర్జన పడుతున్నారు. మరో వైపు పోటీలో నిలిచిన అభ్యర్థుల గుండెల్లో రైళ్ళు పరుగెతున్నాయి. గెలుస్తామనే ధీమా ఉన్న అభ్యర్థులు ఒక వైపు గెలిచిన తర్వాత ఏ విధంగా సంబురాలు చేయాలన్న ఏర్పాట్లు చేయడంతో నిమగ్నమైతే మరో వైపు గెలుస్తామో లేదో అన్న అనుమానం ఉన్న వారి పరిస్థితి ఒకింత ఆందోళనతో ఉన్నారు. కాగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి కార్పోరేషన్‌లోని 60 డివిజన్‌ల బరిలో ఉన్న అభ్యర్థులు ఆయా పార్టీల నేతలు ఇప్పటికే మంచిర్యాల నుండి తరలించేశారు. ఓట్ల లెక్కింపుకు ముందే అభ్యర్థులను ఇతర ప్రాంతాలకు తరలించి ఓడిన వారిని మంచిర్యాలకు పంపించి గెలిచిన కార్పోరేటర్లను క్యాంపులోకి పంపించేందుకు సర్వం సిద్దం చేసేశారు.అభ్యర్థులను ఆయా పార్టీల అదినాయకులు ఇప్పటికే తరలించేశారు. మొత్తానికి మంచిర్యాల కార్పోరేషన్ ఎన్నికల పూర్తికాగా ఓట్ల లెక్కింపుకు అంతా ఉత్కంఠతో ఎదురుచూస్తుండగా గెలుపు ఓటములు ఎవరికి వరిస్తాయో మేయర్ స్థానం ఏ పార్టీని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని అరుణ

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరిత్యా నేరమని పుట్టబోయే శిశువు ఆడనా మగనా అని అడగడం నిర్ధారణ చసి చెప్పడం రెండూ నేరమే అని ఇలాంటి వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశా అధికారిని ఎస్.అనిత హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల రెడియాలిస్టులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ స ందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగనిర్ధారణ కోసం సంప్రదించిన వారికి ప్రోత్సహించిన వారికి చేయించుకున్న వారికి చట్ట ప్రకారంగా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. కావున అందరు వైద్యులు గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం ప్రకారంగా నడుచుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రతి స్కానింగ్ కేంద్రంలో రోగులకు గర్భవతులకు వైద్య సౌకర్యములు , కూర్చుండటానికి సదుపాయాలు , వీల్ ఛైర్లు, మంచినీటి సౌకర్యము కల్పించాలని తెలిపారు. అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రులకు స్కానింగ్ కేంద్రాలకు వచ్చే రోగుల వివరములను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కొత్తగా కమీషనర్ నుండి వచ్చిన ఫామ్ ఆప్‌లో నమోదు చేయాలని స్కానింగ్ కోసం వచ్చే రోగుల ఆధార్‌కార్డును వివరములను సేకరించాలని , తీసుకుంటున్న చార్జీలు ఫీజులు వైద్యుల వివరాలను గోడపైన అతికించి ఉంచాలన్నారు. రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని, స్కానింగ్ కేంద్రాలలో ఎలాంటి ఆడా, మగా నిర్ధారించే పోస్టర్లను ఉంచరాదని రోగు వివరములను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేయాలని అన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో గురువారం ఏఐటీయుసి ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు బుర్రెం బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను సవరణ చేస్తూ 4 లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలుతో కార్పోరేట్ సంస్సథలకుసులభంగా వ్యాపారాలకు ద్వారాలు తెరిచి కార్పోరేట్ ప్రయోజనాల వారి లాభాలు పెంచేందుకే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ దేశంలో పనిచేస్తున్న కార్మికుల కష్టాన్ని కార్పోరేట్ సంస్థలకు దారాదత్తం చేయడానికి ఈ ప రభుత్వం వారికి బంగారు పళ్ళెంలో పెట్టి బహుమానంగా ఇచ్చేందుకు సిద్దమైందన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఈ కోడ్స్‌ను ఉపసంహరించుకుని ప్రభుత్వమే కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మకాలు ఆపాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ అసంఘటిత రంగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే సమ్మెను మరింత ఉద్రిక్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజేష్, పీరయ్య, శ్రీను, సాయికుమార్, బాలయ్య, కృష్ణణ, కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి




**ప్రజాపక్షం / తిర్యాణి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు నాయకుడు టీకానంద్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల కేంద్రంలో సిపిఐ, సిపిఎం, సిఐటియు, అంగన్వాడీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చింతపల్లి నుంచి కొమరం భీమ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు యజమానులకు లాభం చేకూర్చేలా ఉన్నాయని, ఇవి కార్మికుల ఉద్యోగ భద్రతకు గొడ్డలిపెట్టుగా మారాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం కల్పించాలని, విద్యుత్ రంగ సంస్కరణలను తక్షణమే నిలిపివేయాలని వారు స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయకూడదని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, శ్యామ్ రావు, శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగు లచ్చ గౌడ్, కాంగ్రెస్ నాయకులు విజయ్, పెరుమండ్ల వెంకటేశం గౌడ్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గనుల్లో ధర్నా

**ప్రజాపక్షం / కాసిపేట :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాసిపేట గనుల్లో కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కాసిపేట 1 ఇంక్లైన్, 2 ఇంక్లైన్ గనుల్లో జెఏసి ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం వల్ల కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జరిగే కౌంటింగ్ కోసం మంచిర్యాలలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాల, బెల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ పాఠశాల, క్యాతనపల్లి ఆర్ కె సి ఓ ఏ క్లబ్, లక్షెట్టి పేట పాత ఎంపిడిఒ కార్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ కోసం 66 మంది సూప ర్వైజర్లు, 132 మంది సహాయకు లను కేటాయించామన్నారు. బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపే టలో రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నట్లు వివరిం చారు. క్యాతనపల్లిలో 22 , మంచిర్యాలలో 60 ఏర్పాటు చేసి రౌండ్‌కు వెయ్యి ఓట్ల చొప్పున లెక్కిస్తామని తెలిపారు. కౌంటింగ్ సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రోబోటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్లేట్ పాఠశాల ప్రతిభ



**ప్రజాపక్షం / జన్నారం :** హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ బాట్ ప్లస్ ఇన్నోవిటీ రోబోటిక్స్ ఛాంపియన్ షిప్ 2025–26లో జన్నారం స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. జనవరి 10న నిర్వ హించిన ఆన్‌లైన్ పరీక్షల్లో 7వ తరగతికి చెందిన శౌర్య, శ్రేయస్, వైభవ్ తమ సాంకేతిక నైపుణ్యంతో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసు కున్నారు. విజేతలకు రూ.5,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతా యని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ షిరిన్ ఖాన్, ఎటి ఎల్ అండ్ ఈ బాట్ ఇన్‌చార్జ్ శ్రావణి, ఉపాధ్యాయులు జాకీర్, అస్మా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు మోడీ అసమర్థత పాలనకు నిదర్శనం..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామంలో గల నిర్మల్ నుండి మంచిర్యాల వెళ్లే ప్రధాన రోడ్డుపై ఐఎఫ్టీయు,ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్,రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా రోడ్డు పై రాస్తారోకో నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఐఎఫ్టీయు జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్ మాట్లాడుతూ దేశ కార్మికులు సుదీర్ఘకాలం పాటు అనేక పోరాటాలు,త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయడం,అత్యంత దుర్మార్గమని,పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను,హక్కులను,స్వేచ్ఛను,కనీస సౌకర్యాలను కల్పించకుండా,కార్పొరేట్ యాజమాన్యాలకు కార్మికుల శ్రమను యదేచ్ఛగా దోచుకునే విధానాలను అమలు చేయడం దేశ కార్మిక వర్గానికి అన్యాయమని,బీజేపీ మోడీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక నాలుగు కార్మిక వ్యతిరేక బిల్లులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు.కూలీ పనిపై ఆధారపడి జీవిస్తున్న,పేదలు,కష్టజీ వులు,వ్యవసాయ కూలీలపై పిడుగుపడినట్లుగా,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర లో భాగంగా విబిజీ రామ్ జీ చట్టాన్ని తెచ్చి ఉపాధి హామీ కూలీల పొట్ట కొడుతున్నదని ఆరోపించారు.ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితులు తన రాష్ట్రానికి చెందిన అంబానీ,అదానీ లకు దేశంలో ఉన్న కోట్లాది రూపాయల వనరులు,ఉత్పత్తులను ఆపాదించడమే,మోడీ పాలనకు అర్థ మని,విత్తన,విద్యుత్ సవరణ బిల్లులు,నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను,రైతులను అనేక కష్టాలకు గురిచేస్తా యని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్య క్షుడు దుర్గం లింగన్న,ఐఎఫ్టియు డివిజన్ నాయకులు ఆడెపు గణేష్,పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మల్లక్క,ఏఐకే ఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి,కోపొలి,డివిజన్ నాయకులు గోట్ల ప్రసాద్,గోగు శేఖర్,మాంకా శ్రీని వాస్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసమగ్ర అభివృద్ధికి పెద్దపీట

### అష్టా గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్

**ప్రజాపక్షం/ముధోల్ :** గ్రామ సమగ్ర అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు.గురువారం మండలం లోని అష్టా గ్రామంలో రానున్న మహాశివరాత్రిని పుర స్కరించుకుని గ్రామాభివృద్ధిలో భాగంగా సర్పంచ్ అధ్వర్యంలో 30 మంది పారిశుధ్య కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు గ్రామ చుట్టూరా స్వచ్ఛతకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుం దని వారు పేర్కొన్నారు.గ్రామంలో రోజు వారీగా పర్య టిస్తూ సమస్యలను ఆరా తీస్తూ ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు .గ్రామంలో,అన్ని కాలనీలను శుభ్రం చేయడంతో పాటు మౌలిక సదుపాయాల కృషికి తమ వంతు బాధ్యతగా పాటుపడుతున్నామని వెల్లడించారు.ఇప్ప టికే రానున్న వేసవి కాలం దృష్ట్యా నీటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకు న్నామని స్పష్టం చేశారు.గ్రామాభివృద్ధిపై ఒక నిర్దిష్ట మైన ప్రణాళికతో దశల వారీగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ గంగాధర్,ఉప సర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు హుందాగా వ్యవహరించాలి

### సి.పి.యస్ ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి పూర్తి రెమ్యునరేషన్ చెల్లించకుండా కోత విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని,అధికారులు హుందాగా వ్యవహరించాలని సి.పి.యస్.ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు.అనేక ఇబ్బందుల మధ్యన విధులు నిర్వహించి,ఎన్నికలను విజయ వంతంగా పూర్తి చేసి,ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచామని,అయినా కూడా కొందరు అధికారులు తమకు రావాల్సిన రెమ్యూనరే షన్ ను తగ్గించి ఇవ్వడం సబబు కాదని అన్నారు.ఎన్నికల వచ్చినప్పుడల్లా అధికారుల తీరుతో విసిగి పోతున్నామని అన్నారు.పూర్తి రెమ్యునరేషన్ ను ఉపాధ్యాయులకు వీలై నంత తొందరలో చెల్లించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో మంత్రులకు,అధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.కొన్ని చోట్ల సిబ్బందికి సరైన భోజనం కూడా పెట్ట లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు ఇలాంటి విష యాల్లో హుందాగా ఉండాలని కోరారు.రాత్రి వరకు విధుల్లో ఉన్న సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొన్నారని అన్నారు.

## ఐవో భవన నిర్మాణానికి భూమిపూజ



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** గ్రామీణ ఉపాధి హామీ నిధులతో మంజూరైన విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణ పనులకు ఎల్లూ రులో భూమిపూజ నిర్వహించారు. గురు వారం మండలంలోని ఎల్లూరు గ్రామంలో సర్పంచ్ చప్పుడి రవీందర్, మండల అభివృద్ధి అధికారి అల్బర్ట్ తో కలిసి భవన నిర్మాణ పను లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి, వారి కార్యకలాపాల నిర్వహ ణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుం దని తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపస ర్పంచ్ దుర్గం నారాయణ, వార్డు సభ్యులు సునీత, దామోదర్, అశోక్, గ్రామ పెద్దలు చప్పిడే సత్యనారాయణ, కుకిడే రాజేశ్వర్, బాపు, శోభన్, శ్రీకాంత్, సిరిపురం భీమయ్య, సదాశివ్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం / కన్నెపల్లి/ బెల్లంపల్లి :** ప్ర భుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలను ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండా లని సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరో గ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి తెలిపారు. పాఠశాలల్లో భోజనశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వార్షిక పరీక్షల నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థు లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయు లను ఆదేశించారు. జిల్లా అధికారులు, పాఠ శాల సిబ్బంది పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

### ఎస్‌పి నితికా పంత్

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్/ కాగజ్ నగర్ :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజ యోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించ డానికి అనుమతి లేదని జిల్లా ఎస్‌పి నితిక పంత్ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడిం చారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్ట ర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లెక్కింపు కేంద్రాల వెలుపల 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా టపాకాయలు కాల్చడం, డీజెలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

## గాయపడిన కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరే షన్ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోన ప్రసాద్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయ డంతో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గురువారం పరా మర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కోన ప్రసాద్‌పై కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ అగల్ డ్యూటీ రాజు అతని అనుచరులు దాడి చేసినట్లు ఆయన ఆరోపించారు. దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసి బెదిరింపులకు గురి చేస్తే భవిష్యత్‌లో చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. దాడి విష యమై ఉన్నతాధికారులను కలిసి దాడి చేసిన వారికి చట్టరీత్యా చర్యలు తీసుకునే వరకు పోరాడుతామని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక అండ



**ప్రజాపక్షం / కౌటాల :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువ కుని కుటుంబానికి గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు రూ. 43,650 ఆర్థిక సాయం అందజేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గురుడుపేట గ్రామానికి చెందిన నగోసే మొండి (18) నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన ఆ యువకుని అంత్య క్రియల ఖర్చుల కోసం మాలి సంఘం, పూలే సేవా సమితి సభ్యులు సోషల్ మీడియా ద్వారా విరాళాలు సేకరించారు. దాతలు అందిం చిన నగదును సర్పంచ్ భీంరావు, మాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీకోడే గంగారాం చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యు లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీకోడే సంతోష్, మోర్లె పాండురంగ్, గుర్లే శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీని వాస్, రామచందర్, కొండయ్య, కిష్టయ్య, రాజు, శ్యామ్‌రావు, వార్డు సభ్యులు వెంకటేశ్, చిన్న మల్లు పాల్గొన్నారు.

## మందమర్రిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



**ప్రజాపక్షం / మందమర్రి :** కార్మిక సంఘాల జెఎసి పిలుపు మేరకు మందమర్రి ఏరియాలో చేపట్టిన ఒకరోజు సమ్మెతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో గురువారం కార్మికులు స్వచ్ఛందంగా విధులను బహి ష్కరించడంతో గనులన్నీ బోసిపోయాయి. ఏరియాలోని 2,861 మంది కార్మికుల్లో కేవలం 612 మంది మాత్రమే విధులకు హాజరై నట్లు అధికారులు వెల్లడించారు. అత్యవసర విభాగాలు మినహా మిగిలిన కార్మికులంతా సమ్మెలో పాల్గొనడంతో గనుల వద్ద నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. కార్మికుల హక్కులు, వేతన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గనుల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జెఎసి నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం / కెరమెరి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ కుటికెల ఆనంద్ రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కాలరాస్తూ కేంద్రం కొత్త కోడ్ లను తీసుకువచ్చిందని మండిపడ్డారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

సిఐ వెంకట్ నారాయణ వెల్లడి



**ప్రజాపక్షం/బోధన్:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణంలో విజయోత్సవ ర్యాలీలో నిర్వహించేందుకు అనుమతి లేదని బోధన్ పట్టణ సీఐ వెంకట్ వెంకట్ నారాయణ తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తరువాత గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీ తీసేందుకు బోధన్ పట్టణంలో ఎలాంటి ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలో నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు.

## కౌంటింగ్ కేంద్ర్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని విజయ మేరి పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్నరి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పశీలించారు. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను, కౌంటింగ్ హాల్స్ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు పక్రియ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున ఎంతో జాగ్రత్తతో భాధ్యతయుతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ హితవు పలికారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పూర్తి పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జ రపాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సొంత నిర్ణయాలను ఎట్టి పరిస్థితిలోనూ అమలు చేయకూడదని అన్నారు. ఫలితాలను సైతం జాగ్రత్తగా పరిశీలించుకొని వెల్లడించాలని సూచించారు. కౌంటిగ్ హాల్ లోకి ఆర్ఓ మినహా ఇతరులు ఎవ్వరికీ సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమయపాలన పాటిస్తూ కౌంటింగ్ విధులకు సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు. పాసు కలిగి ఉన్న వారిని కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా తుది ఏర్పాట్లను పూర్తి చేశామని, సిబ్బందికి అల్పాహారం భోజనాలను కూడా ఓట్ల లెక్కింపు కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలిస్ బందోబస్తు ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బ్యాలెట్ బాక్స్‌లో ఓటర్ తీర్పు..

గెలుపుపై బరిలో నిల్చిన అభ్యర్థుల్లో టెన్షన్

అభ్యర్థులను క్యాంప్ లకు తరలించిన పార్టీలు




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో గుబులు మొదలయింది.పట్టణంలోని 12 వార్డులకు 56 మంది అభ్యర్థులు పోటీ పడగా అందులో మొత్తం 17693 మంది ఓటర్లకు గాను 13240 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా ఓటు నమోదు కాగ రెండవసారి కూడా జిల్లాలోనే అత్యధికంగా 74.83 పోలింగ్ శాతం నమోదయ్యింది.దీంతో పెరిగిన ఓటింగ్ శాతం ఏ పార్టీకి లాభం చేకూర్చుతుందో తెలియాలి పోలింగ్ సరళిని అంచనా వేస్తూ ఎవరికి వారు గెలుపు ధీమా మాది అనే ఆశ భావంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు.పట్టణంలో ఈసారి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్,కాంగ్రెస్,బీజేపీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.దీంతో ఓటరు మనోగతం బయటపడని స్థితి ఉంది.అధికార కాంగ్రెస్ను కట్టడి చేయాలన్న భావనతో బీఆర్ఎస్,బీజేపీలు కాంగ్రెస్ కు గట్టి పోటీనిచ్చాయి.దీంతో ఆయా పార్టీల అభ్యర్థుల్లో కలవరం మొదలైంది.అదేవిధంగా ఆయా పార్టీలకు పలుచోట్ల కొరకరాని కొయ్యగా స్వతంత్ర అభ్యర్థులు గట్టిపోటీని ఇవ్వనుండడంతో ఆయా పార్టీల నేతలు ఎవరు గెలుస్తోరో అనే అంచనాలు వేసే పనిలో తలమునకలవుతున్నారు.ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో తమ భవితవ్యం ఎలా ఉంటుందో అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.ఎన్నికలు ఎలా ఉన్న ఓటరు నాడిని ఓడిసిపట్టడంలో అభ్యర్థులు అయోమయంగా,ఎన్నికల ఫలితాలు వెళ్లడయ్యే వరకు తమ రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందని అనుయాయులతో మంతనాలు సాగిస్తున్నరుఉ.శుక్రవారం వెలువడే ఎన్నికల ఫలితాలతో విజేతలేవరో తెలుస్తుంది.దీంతో మేకపోతు గాబీర్యంతో ఎన్నికలో నిలిచిన అభ్యర్థులు తమ గెలుపుపై ఎవరి దీమా వారు వ్యక్తం చేస్తున్నారు.మరో వైపు క్యాంపు రాజకీయాల ప్రయత్నాల్లో వివిధ పార్టీ నేతలు ఉన్నారు.రాజకీయాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం మున్సిపల్ ఎలక్షన్స్ రిజల్ట్స్ ప్రకటించిన తర్వాతి రోజే చైర్మెన్,వైస్ చైర్మన్ల,ఎన్నికకు నోటీఫికేషన్ జారిచేయనుండడంతో క్యాంపు రాజకీయాలకు తెరపడనుంది.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు..

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్,ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.నిర్మల్,భైంసా,ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు.సమయపాలన అత్యంత ముఖ్యమని,సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు.అన్ని నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ,పారదర్శకంగా వేగవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ,జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు.అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు.సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.అనంతరం కౌంటింగ్ హాలుల్లో ఏర్పాటు చేసిన సీసీఈ కెమెరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్‌లకు దాసోహమైన మోడీ ప్రభుత్వం

బైంసాలో సార్వత్రిక సమ్మె..



**ప్రజాపక్షం/బైంసా :** కార్మిక,రైతు,ప్రజలను కార్పొరేట్‌లకు దోచిపెట్టడం మానుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకెఎంఎస్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.రాజు, టి.యు.సి.ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏం.బక్కన్న రామ్ లక్ష్మ ణ్ ఐ.ఎఫ్.టి.యు జిల్లా కార్యదర్శి ఎం.హరిత ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఇప్ప లక్షణ్ లు హెచ్చరించారు.గురువారం సంయుక్త కిసాన్ మోర్చా,సి.టి.యు ల ఆధ్వర్యంలో బైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సార్వత్రిక సమ్మె సభలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేకంగా చట్టాల రూపొందిస్తున్నదని అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తెస్తున్నదని విమర్శించారు.కార్మికుల జీతభత్యాలు తక్కువగా ఉండి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత పరిస్థితులో కోడ్‌ల రూపంలో దోపిడీ పెంచుతున్నారని విమర్శించారు.వ్యవసాయ రంగాన్ని వ్యాపారాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే కుట్రలో భాగంగా విత్తన చట్టం విద్యుత్ చట్టం తెస్తున్నదని అన్నారు.అమెరికాతో చేసుకున్న ఒప్పందాలు భారత చిన్న సన్న కారు రైతాంగ వెన్ను విరుస్తాయని ఇది మోడీ తన ఫ్రెండు అయినా ట్రంప్ కు ఇస్తున్న బహుమతి అని విమర్శించారు.కార్మిక కర్ష క లోకం ఏకమై మోడీ ప్రభుత్వం పై పోరాటాన్ని కొనసాగిస్తారని హెచ్చరించారు. పి.డి.ఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ మద్దతు తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గంగాధర్ దీనాజీ ఏఐకేఎస్ నాయకులు ముత్తన్న, టి.యు.సి.ఐ నాయకులు గోదావరి,ఏఐటీయూసీ నాయకులు కార్మికులు దేవిదాస్,రాములు,శంకర్,అనురాధ, నరేష్,నరేంద ర్,మధుకర్,గంగాధర్,రమేష్, పాల్గొన్నారు.

## ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి: ధన్‌పాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** శ్రీదేవి అమ్మవారి మహిమలు ఎంతో విశిష్టమైనవని అమ్మవారిని భక్తిశ్రద్ధతలో కొలిస్తే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఈనెల 3 నుండి 12 వరకు బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ హిందూ ప్రజలకు ముఖ్యంగా మహిళలకు అమ్మవారి విశిష్టతలు వివరించటం ఎంతగానో నచ్చాయన్నారు. ఇలాంటి వైభవమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇందూరు నగరంలో మరిన్ని నిర్వహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆగమయ్య గజవాడ, పార్శి రాజు, యంసాని రవీందర్, లాభిశెట్టి శ్రీనివాస్, సమస్త ఇందూరు భక్త బృందం పాల్గొని విజయవంతం చేశారు.

## బైంసా ఆటో నగర్‌లో దొంగతనం..



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఆటో నగర్ ప్రాంతంలో గల హాజార హుస్సేన్ అనే వ్యక్తి ఇంట్లో అర్ధరాత్రి దొంగతనం జరిగింది.బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.బుధవారం ఎన్నికల పోలింగ్ ఉండడంతో కుటుంబీకులు తమ బంధువుల ఇంటికి వెళ్లారు.ఇంటికి తాళం ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు చోరికి పాల్పడ్డాడు.3.7 తులాల బంగారం,కిలోన్నర వెండి.రూ.1.50 లక్షల నగదు చోరికీ గురైనట్లు హుస్సేన్ తెలిపారు.దొంగతనం జరిగిన విషయాన్ని బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్




**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మెలో భీమ్‌గల్ పట్టణంలో అంగన్‌వాడీ ఉద్యోగులు,మున్సిపల్ కార్మికులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించగాసీపీఐ జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం ఉపాధిహామీ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లను తీసుకవచ్చిందని విమర్శించారు.ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఉపాధిహామీ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షులు దేవగంగు, నాయకులు జ్యోతి, ప్రమీల, చంద్రకళ, భాగ్య, వసంత, నాయకులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు ఏర్పాట్ల పూర్తి

మున్సిపాలిటీలో ముగిసిన పోలింగ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపల్ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. గత కొద్ది రోజులుగా సాగిన హోరాహోరీ ప్రచారం ఆపై ముగిసిన పోలింగ్‌తో ఇప్పుడు అందరి కళ్లు కౌంటింగ్ కేంద్రంపైనే ఉన్నాయి. మున్సిపల్ పీఠంపై ఏ పార్టీ జెండా ఎగురుతుందోనన్న ఉత్కంఠ అటు అభ్యర్థుల్లో, ఇటు ప్రజల్లో తారాస్థాయికి చేరింది. బరిలో 49 మంది అభ్యర్థులుండగా గెలుపు తమదంటే తమదని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు :

కౌంటింగ్ ప్రక్రియ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 150 మంది సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో నియమించారు. పోలీసులు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

**భద్రత :** సీసీ కెమెరాల నిఘాలో, పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఓట్ల లెక్కింపు జరగనుంది.

**పాసులు :** అభ్యర్థులకు వారి ఏజెంట్లకు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుంది.

గెలుపు ఎవరిది ?

ఈసారి భీమ్‌గల్ మున్సిపాలిటీలో ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తుండగా టీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠం దక్కించుకుంటామన్న ధీమాతో ఉంది.

## పూర్వ విద్యార్థుల చేయూత

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన బొమ్మిడి రమేష్ లతా దంపతుల కుమారుడు యశ్వంత్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించగా పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. గురువారం 19951996 బ్యాచ్కు చెందిన పదవ తరగతి విద్యార్థులు తమ వంతు సహాయంగా 32,500 నగదును సేకరించి మృతుడి యశ్వంత్ కుటుంబ సభ్యులకు అందజేసి అండగా నిలిచారు. విష్ణువర్ధన్ రాజు, రాజేశం, భూమేష్ ,రామ్ గోపాల్ ,గణేష్ ,ఉన్నారు.

## అధికారులకు ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు ప్రజాప్రతినిధులకు గురువారం ఘనంగా సన్మానం చేశారు. ఈ మేరకు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, తాసిల్దార్ శ్రీనివాస్ ,ఎస్ఐ అనిల్, వైద్యాధికారిణి వాహిని, లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. క్లబ్బు మండల అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి,డాక్టర్ మండ స్వామి,ప్రభాకర్ రావు, ఆకాష్ ,సోమయ్య ,ప్రేమ్, తదితరులున్నారు.

## ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రారంభత్సవం

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణంలోని శివాలయంలో గురువారం సదుల సంతోష్ సువర్ణ దంపతులు ప్రదర్శిత ద్వాదశ జ్యోతిర్లింగాలను నిర్మాణం చేయగా తహసీల్దార్ మొదటి లింగాన్ని ఆవిష్కరించి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయానికి భక్తితో ఆర్థిక వనరులను అందిస్తూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్న శివ సేవకుల సేవలు ఆభినందనీయని అన్నారు. వివిధ రాష్టాలలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లిగాలను ఓకే చోటా భక్తులు దర్శనం అయ్యో విధంగా ఏర్పాటు చేసిన సదుల సంతోష్ సువర్ణ దంపతుల కృషి అభినందనీయమని అన్నారు. **అమ్మ కోరిక నేరవేరింది :** గత మహా శివరాత్రి రోజు శైవ ఆలయాలన్ని దర్శనం చేసుకొని శివాలయంకు రాగ మా అమ్మ సర్గీయ సదుల లక్ష్మి దేవి మల్లయ్య శివాలయంలో ప్రశంతంగా ఉందని శివాలయంలో ఏదైన చేయాలని నాతో మాట తీసుకుందని ఇంతలో ఆమె మరిణించగ ఆమె కోరిన ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులకు దర్శనం కలిగేలానిర్మాణం చేశామని సంతోష్ అన్నారు. ,రచన ,ఆశోక్ రాజ్యలక్ష్మి అందే సురేష్, నీలిమా, గోల్డ్ గ్రూప్ సభ్యులు శివసేవకులు రమేష్,కడకుంట్ల జగదీశ్వర్, దాసరి గంగాధర్, కిష్టయ్య పాల్గోన్నారు.

## సిరిపూర్ లో మహిళ సంఘాల భవనాలకు భూమి పూజ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని సిరిపూర్ గ్రామంలో నిర్మిస్తున్న మూడు మహిళా సంఘాల భవనాల కు గ్రామ సర్పంచ్ పెంట సౌజన్య శ్రీనివాస్ , ఏం సి చైర్మన్ పుష్పలత నర్సయ్యతో టిపిసిసి నాయకులు జువ్వడి కృష్ణారావు భూమి పూజ చేశారు. 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న భవనాలు గ్రామంలోని మహిళల సంఘాల సమావేశానికి ఉపయోగపడతాయని వెనువెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలలో కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మిల్క నవీన్ రెడ్డి, గడ్డం లక్వతి రెడ్డి, మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి,గ్రామాల నాయకులు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై గర్జించిన టిఎల్ఎఫ్

### దేశవ్యాప్త సమ్మెకు ఎడపల్లిలో మద్దతు




**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన దేశవ్యాప్త సార్వజనిక్ సమ్మెకు మద్దతుగా ఎడపల్లిలో తెలంగాణ లోకల్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దల్లా సురేష్ మహాజన్ నేతృత్వంలో వామపక్ష సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మహాజన్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 30కోట్లకు పైగా కార్మికులు పాల్గొంటున్న ఈ సమ్మెకు టిఎల్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు అప్రజాస్వామికమని, ఇవి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మికులను బానిసలుగా మార్చే కుట్రలో భాగమేనని ఆయన మండిపడ్డారు. పేద ప్రజల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వామపక్ష నేతలు, టియుసిఐ నాయకులు రాజేశ్వర్, నరేందర్, వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు గంగాధర్ లు మాట్లాడుతూ.. కేంద్రం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. సఫాయి కార్మికులతో పాటు టిఎల్ఎఫ్ నాయకులు గంగాధర్, పోశెట్టి, వివిధ వామపక్ష సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

### భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతిని

# యువతకు చేరువ చేయడమే లక్ష్యం

### నృత్య కళాకారిణి ప్రగ్యా ఘోష్




**ప్రజాపక్షం/ఎడపల్లి:** భారతీయ శాస్త్రీయ సంగీతం, సంసృ్కతిని యువతకు చేరువ చేయడమే లక్ష్యమని ప్రముఖ ఒడిస్సి నృత్య కళాకారిణి ప్రగ్యా ఘోష్ అన్నారు. సోసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ట్ యూత్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో గురువారం ఒడిస్సీ నృత్య ప్రదర్శన వైభవంగా జరిగింది. ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి ప్రగ్యా ఘోష్ అతన అద్భుథ ప్రదర్శనతో విద్యార్థులను, ఉపాధ్యాయులను అలరించారు. ఈ మేరకు ప్రగ్యా ఘోష్ మాట్లాడుతూ.. భారతదేశపు ప్రాచీన కళలు, నృత్య రీతులు మన దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఒడిస్సీ నృత్యంలోని విశిష్టతను, భావ ప్రకటనను విద్యార్థులకు వివరిస్తూ ప్రతి ఒక్కరూ మన సంస్కృతి పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. శాస్త్రీయ నృత్యం కేవలం వినోదం మాత్రమే కాదని, అది క్రమశిక్షణతో కూడిన ఒక సాధన అని విద్యార్థులకు తెలియచేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి గొప్ప కళాకారుల ప్రదర్శనలను వీక్షించే అవకాశం కల్పించిందని పాఠశాల యాజమాన్యం స్పిక్ మాకాయ్ సంస్థకు కృతజ్ఞతలు తెలియచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యక్తిని ఢీకొట్టిన బైక్.. ఒకరికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల పరిధిలోని బాపునగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో బైక్ నడపడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణానికి చెందిన షేక్ అహ్మద్ ఖురేషి తన బైక్ పై నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్తున్నాడు. బాపునగర్ గ్రామ శివారుకు చేరుకోగానే, అదే సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. అయితే ఖురేషి మద్యం మత్తులో ఉండటంతో బైక్ పై నియంత్రణ కోల్పోయి, రోడ్డు దాటుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ పై నుంచి కింద పడటంతో ఖురేషి తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఘటన స్థలంలో భారీగా రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఆ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

# కేంద్రం తీసుకవచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్




**ప్రజాపక్షం/జగిత్యాల :** కార్మకులకు మరణ శాసనంగా కేంద్రం ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముఖ్రం, ఐఎప్‌టీయూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్, టీయూసీఐ రాష్ట్ర నాయకుడు భీమయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి , రైతు సంఘం రాష్ట్ర సంఘం నాయకుడు లెల్లల బాలకృష్ణలు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దిన పోరాట స్ఫూర్తిని నేటి కార్మికులకు తెలియకుండా చేసే ప్రయత్నాలకు కేంద్రం పూనుకున్నదన్నారు. లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఐక్యంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని పేర్కొన్నారు. అంగన్ వాడి, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, జీపీ కార్మికులు, వీఓఏ, ఆర్పీ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

## కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/బోధన్:** దేశవ్యాప్తి సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో కు కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రం అందచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. సిఐటీయూ జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్ గౌడ్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య లు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసం రూ. 26వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు నష్టం చేసేల ఉన్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంటాక్ట్, ఔటట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు కుమారస్వామి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రదాన కార్యదర్శి టి.సాయిలు, బిఎల్‌టియు జిల్లా నాయకులు దాల్ మల్క పోశెట్టి, లక్ష్మణ్ గౌడ్, వినోద్, కార్మికులు పాల్గొన్నారు.

## నూతన మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో నూతన మహిళా సంఘం భవన నిర్మాణానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పురమల్ల వినోద్ కుమార్ లు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు సంఘటితంగా ఉండి ఆర్థికంగా ఎదగడానికి ఈ భవనం ఎంతో దోహద పడుతుందని అన్నారు. త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకు వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ బాబా, వార్డు సభ్యులు బండారి పద్మ, కొల్తే దమ్మ, తోట వెంకటేష్, ఔదారి రంజిత్, టెంకటి లక్ష్మి , పాలకవర్గం సభ్యులు, నాయకులు డ్వాక్రా సంఘాలు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తుతాం

### ఐఎఫ్టియూ పిలుపు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సమ్మె కొనసాగుతుందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల మొండి వైఖరి అవలభిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ జే.పద్మ, ఎడపల్లి మండల అధ్యక్షులు ఎస్ ప్రవీణ్, ఉపాధ్యక్షులు సిహెచ్ గోపి, రాజయ్య, మోహన్, కార్యదర్శి గోనె గంగారాం, సాయిలు, జే లింగం తదితరులు పాల్గొన్నారు.